బీసీ సమస్యలపై మంత్రి మండలిలో చర్చించండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల సమస్యలు, రిజర్వేషన్లపై మంత్రి మండలిలో చర్చించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వానికి బుధవారం విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా బీసీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా బీసీ సబ్ ప్లాన్‌ను గతంలో ప్రకటించి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలన్నారు. ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి

అమీర్‌పేట: పవిత్రతకు నిలయమై ఆలయ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. నూతనంగా నియమితులైన బాపూనగర్ వీరాంజనేయస్వామి, ఎస్ఆర్‌నగర్ వేంకటేశ్వర దేవాలయం పాలక మండలి సభ్యులు బుధవారం కోట నీలిమను మర్యాదపూర్వకంగా కలిశారు. పాలక మండలి సభ్యులను ఆమె సన్మానించారు.

కిమ్స్ సన్‌షైన్‌లో ఏఆర్ ఓపీడీ సేవలు షురూ

సనత్‌నగర్: దేశంలోనే మొట్టమొదటిసారిగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో ఆగ్‌మెంటెడ్ రియాల్టీ ఓపీడీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి తెలిపారు. శరీరంలోని అవయవాలు ఎక్కడ దెబ్బతిన్నాయి.. కేన్సర్స్, అల్సర్స్, ఇతర సమస్యలను (ఏఆర్) ఆధారిత టెక్నాలజీ సాయంతో తెలుసుకోవచ్చన్నారు. దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ మెడికల్ టెక్నాలజీ కంపెనీ స్కియాతో కలిసి ఏఆర్ ఆధారిత ఓపీడీ సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ కన్సల్టెంట్ సర్జన్ విమలాకర్‌రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రియో ఎంటరాలజిస్ట్ రోహన్ రెడ్డి, ఆస్పత్రి సీఓఓ సుధాకర్‌జాదవ్, స్కియా ఇండియా సీఓఓ అభిషేక్ బండారు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రయాదవ్‌పై దాడి దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీవై పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌పై పోలీసుల దాడికి ఓయూలో నిరసన తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఏపీలోని టీడీపీ ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులపై దాడులు పెరిగాయని అన్నారు. విజయవాడలో జరిగిన నిరుద్యోగుల నిరసనలో పాల్గొనందుకు పోలీసులు రాంచంద్రయాదవ్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఏపీ హైకోర్టు కేసును సుమోటగా తీసుకుని దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజుయాదవ్, సురేస్‌గౌడ్, భగత్ సింగ్, గణేష్ మాదిగ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటోన్మెంట్‌ను గత ప్రభుత్వం విస్మరించింది'

రసూల్‌పురా: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా టీపీసీసీ సెక్రటరీ రాజేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయలతో కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పేదలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలంరాయి వినోద్, అన్నానగర్ మురళీ, అఫ్సర్, పెద్ద నాగరాజు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగిన ప్రమాదంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు వివరాల ప్రకారం .. రైల్వేట్రాక్ పక్కన మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకుని ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. సుమారు 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి రైలునుంచి జారిపడి లేదా పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టిన ప్రమాదంలో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. తెల్లని గీతలు కలిగిన షర్టు, గ్రే కలర్ ప్యాంటు మృతుడి ఒంటిపై ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాల కోసం 9440083160, 8712658581 మొబైల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

మత్తు చిత్తు.!

గంజాయికి బానిసవుతున్న యువత

యవ్వనం కిక్‌లో తూగుతోంది. బలమైన లక్ష్యాలను ఛేధించాల్సిన ప్రాయంలో కుర్రకారు మత్తుతో చిత్తవుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సేవిస్తూ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు, ఇంట్లో కుటుంబ సభ్యులకు తెలియకుండా తమకు తెలియకుండానే గంజాయి ఊబిలోకి దిగిపోతున్నారు. యువత గంజాయి తాగుతూ.. పట్టుబడుతూ.. తమ కెరీర్‌ను నాశనం చేసుకుంటున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న వారు కొందరే కానీ వారి కళ్లుగప్పి గంజాయి విక్రయాలతో పాటు తాగుతున్న వారు మరెందరో.!



సనత్‌నగర్: ప్రతినిత్యం సనత్‌నగర్, బేగంపేట, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఘటనలు పోలీసుల తనిఖీల్లో వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఈ మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ ఎక్కడో చోట వీరు పట్టుబడుతూనే ఉన్నారు. పోలీసులకు పట్టుబడిన తర్వాత గానీ తల్లిదండ్రులకు తెలియడం లేదు. పట్టుబడుతున్న వారంతా 20–30 ఏళ్ల లోపు వయస్సు వారే. అందులోనూ 25 ఏళ్లలోపు వారు అత్యధికంగా ఉంటున్నారు. సనత్‌నగర్ పోలీసులు ఇటీవల పట్టుకున్న ఇద్దరు నిందితులను విచారిస్తే వారు పదుల సంఖ్యలో యువకులకు విక్రయించినట్లుగా తెలుస్తోంది. అందులో విద్యార్థులు సైతం ఉండటం మరింత ఆందోళన కలిగించే అంశం.

జల్సాల కోసం విక్రయాలు..

జల్సా జీవితాలకు అలవాటు పడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో యువత ఎక్కువగా గంజాయి విక్రయాలకు దిగుతోంది. ఫతేనగర్ ఇందిరాగాంధీపురా



నికి చెందిన ఓ ఆటోడ్రైవర్ తనకు వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో తన ఇంట్లోనే గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. పెద్ద మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా చాలా మంది వివిధ రకాల కారణాలతో గంజాయి విక్రయాలకు తెగపడుతూ పోలీసులకు సవాల్ విసురుతూనే ఉన్నారు.

ఆ ప్రాంతాల్లోనే ఎక్కువగా పట్టుబడుతూ..

సనత్‌నగర్, బేగంపేట, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న బస్తీల్లోనే ఎక్కువగా గంజాయి వాసన గుప్పిస్తున్నాయి. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ కిందికి వచ్చే ఫతేనగర్ ఇందిరాగాంధీపురం, ప్రభాకర్‌రెడ్డినగర్, జింకలవాడ, దీన్‌దయాళ్‌నగర్, సనత్‌నగర్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను అడ్డాగా చేసుకుని చాలామంది గంజాయిని సేవించడం, విక్రయించడం చేస్తున్నారు. అలాగే బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా ప్రాంతంలోని కొన్ని బస్తీల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తూ యువకులను మత్తుకు బానిసలను చేస్తున్నారు. ఇక ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేచర్‌క్యూర్ పరిసర ప్రాంత బస్తీల్లో తరచూ గంజాయి విక్రేతలు పట్టుబడుతున్నారు. కొంతమంది అయితే చేతి గోళ్లల్లో సైతం గంజాయిని పెట్టుకుని ఏకంగా ఇంట్లో సేవిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడి కావడం ఆశ్చర్యం కలిగించే అంశం.

> **తల్లిదండ్రులు కనిపెడుతూ ఉండాలి**
>
> 
>
> తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారు.? ఎక్కడికి వెళ్తున్నారు.? అని నిరంతరం కనిపెట్టుకుని ఉండాలి. మత్తు అలవాట్లకు దూరంగా ఉండేలా నిత్య పర్యవేక్షణ చేయాలి. వారి ప్రవర్తనను బట్టి అవసరమైతే వారికి కౌన్సెలింగ్ కూడా ఇప్పించాలి. విలువైన జీవితాన్ని మత్తుకు అలవాటు చేయకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులు మత్తుకు బానిస అవుతున్నట్లుగా మా విచారణలో తేలుతోంది. గంజాయి విక్రయాలు జరిపినా, సేవించినా చట్టరీత్యా నేరమే. విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు.
>
> – శ్రీనివాసులు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్

మంత్రులతో ముఖాముఖి.. సమస్యలు ప్రభుత్వ దృష్టికి

లాలాపేట: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు లాలాపేటకు చెందిన ఆర్టీఏ మెంబర్ నేతికార్ సురేష్‌లాల్ పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వారి నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సురేష్‌లాల్ మాట్లాడుతూ.. ఇద్దరు ప్రజాప్రతినిధులు ముఖాముఖిలో అందుబాటులో ఉండటం వల్ల ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రజల సమస్యలు నేరుగా ప్రభుత్వం దృష్టికి వెళ్లేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ముఖాముఖిలో పాల్గొన్న ఆర్టీఏ మెంబర్ నేతికార్ సురేష్‌లాల్

సికింద్రాబాద్ ఎస్సీ సెల్ నూతన కమిటీ



నియామక పత్రాలు అందుకుంటున్న సికింద్రాబాద్ ఎస్సీసెల్ కమిటీ ప్రతినిధులు

చిలకలగూడ: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ అనుబంధ కమిటీ ఎస్సీ విభాగ చైర్మన్ సాయిమధుకర్ తెలిపారు. టీపీసీసీ ఎస్సీ కమిటీ రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతం, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు నూతన కమిటీని నియమించి బుధవారం నియామక పత్రాలు అందదజేసింది. సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా దాసరి శ్యామ్‌సుందర్, వైస్‌చైర్మన్లుగా కాశపాక నరేష్, కదరి మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎల్. మురళీ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, మెట్టుగూడ, అడ్డగుట్ట, తార్నాక డివిజన్ అధ్యక్షులుగా జైకుమార్, కిరణ్‌కుమార్, రోహన్, సాయిరామ్, మురళీకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడం వల్ల కాలనీలలో చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం ఐదోవార్డులో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమకు కనీస అవసరాలు అయిన చెత్త సేకరణ, నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, భూగర్భ డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం తదితర సమస్యలపై బోర్డు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని వివరించారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులను కాలనీకి పిలిపించి వారి సమస్యలను వివరించి త్వరగా వీటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

◆ అనంతరం కాలనీ వాసులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన ఇలాంటి చిన్న చిన్న పనులను కూడా ఎమ్మెల్యే పట్టించుకోవాల్సి వస్తుందన్నారు. అదే బోర్డు ఎన్నికలు నిర్వహించినట్లయితే ప్రతి వార్డుకు ఒక ప్రజాప్రతినిధి ఉంటారని, వారు ఆయా సమస్యలను బోర్డు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. గతంలో ఇక్కడ వార్డు సభ్యులుగా, నామినేటెడ్ సభ్యులుగా పని చేసిన వారు పదవులపై ఉన్న శ్రద్ధను ప్రజలకు సేవ చేయడంలో చూపించలేదన్నారు. సకాలంలో బోర్డు ఎన్నికలు నిర్వహించినట్లయితే సమర్థులకు, నిత్యం అందుబాటులో ఉండే వారికి ఓట్లు వేసి గెలిపించుకోవాలని కాలనీ వాసులకు సూచించారు.



జ్యోతికాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బీసీల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉంది

- 2027లో జనగణనతో పాటు కులగణనను చేపడుతాం
- బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

బన్సీలాల్‌పేట్: బీసీల సంక్షేమం, అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని.. ఆ దిశగా నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘంలో బుధవారం రాత్రి జరిగిన కులగణనపై బీసీ సంఘాల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీలో పార్టీలో బీసీలకు సముచిత ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని పనులను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు ఏ రకంగా అయితే హక్కులు కల్పించారో కులగణన ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీలకు ఆ హక్కు కల్పించనున్నారని తెలియజేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన కులగణన తప్పుల తడక అని ఎద్దేవా చేశారు. 2027లో జనగణనతో పాటు కులగణనను ప్రారంభిస్తారని తెలిపారు.

◆ పేదల కోసం ప్రవేశ పెట్టిన పథకాలు దళారీలు లేకుండా రూ.30లక్షల కోట్లను నేరుగా పేదల బ్యాంకు ఖాతాలోకి పడుతున్నాయని అన్నారు. ప్రధాని మోదీ మహిళా బిల్లుతో పాటు అసాధ్యం కాని వాటిని సుసాధ్యం చేస్తున్నారని వివరించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతితో పాటు దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నదని తెలియజేశారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యాంసుందర్ గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి, మేకల సారంగపాణి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, పీఎల్ శ్రీనివాస్, మంత్రి కళావతి, కార్పొరేటర్ కొంతం దీపికా, భానుకా మల్లికార్జున్, కృష్ణమూర్తి, నగేష్‌లతో పాటు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బీసీ సంఘాల సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణ్

వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: చెన్నూరు ఎమ్మెల్యే డా.వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తున్న కాకా కుటుంబానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి విశేష కృషి చేసిన వివేక్‌కు హోం లేదా విద్యాశాఖ మంత్రిగా అవకాశం కల్పించాలన్నారు. మాలల ఆత్మగౌరవం కోసం రెండు మంత్రి పదవులను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత దిశగా చర్యలు



క్లీనింగ్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ కె. హేమలత

బన్సీలాల్‌పేట్: డివిజన్‌లో పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కె.హేమలత అన్నారు. బుధవారం డివిజన్‌లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ ధనాగౌడ్, సిబ్బందితో కలిసి ఆమె ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయం

కంటోన్మెంట్: స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్పొరేట్ ఆసుపత్రులు బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం, మోండా డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో బిగ్ టీవీ, మెడికవర్ హాస్పిటల్, మ్యాక్స్ విజన్ సహకారంతో కాంగ్రెస్ లీడర్ వైష్ణవియాదవ్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం వైద్యం ఖరీదైన నేపథ్యంలో బస్తీలలోని పేదవారికి ఇలాంటి హెల్త్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అన్ని రకాల పరీక్షలు ఒకే దగ్గర నిర్వహించి వారికి అవసరమైన మందులు, కళ్లద్దాల లాంటివి అందించడం వలన పేదల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని శ్రీగణేష్ హెల్త్ క్యాంపు నిర్వాహకులను అభినందించారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మహాసభ 24న

సికింద్రాబాద్: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభను ఈ నెల 24 వ తేదీన నగరంలో నిర్వహించనున్నట్లు సంఘం హైదరాబాద్ రీజినల్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మహాసభ నిర్వహణ కోసం బుధవారం సికింద్రాబాద్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పవన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... మహాసభను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రభుత్వ పెద్దలు హాజరవుతారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బీసీ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, యూనియన్ ప్రతినిధులు చారి, సంపత్, సాధం బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్
- ఎన్నికై ఏడాదైన సందర్భంగా అభినందన సభ

రసూల్‌పురా: పేదలను కంటికి రెప్పలా.. ఎల్లవేళలా కాపాడుకుంటానని.. ఆనాడు ఏ మాటయితే ఇచ్చానో అలానే ఉన్నానని... ఇక ముందు కూడా ఉంటానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడిగా ఈటల గెలుపొంది ఏడాది పూర్తయ్యింది. ఈ సందర్భంగా అన్నానగర్ చౌరస్తాలో మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎస్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ... కంటోన్మెంట్‌లో నివసించే పేదలకు దుండిగల్, ఘట్‌కేసర్‌లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో పనిచేసుకునే వారికి అక్కడ పని దొరుకుతుందా.? అని ప్రశ్నించారు. అందుకే ఏ ప్రాంతంలో ఉన్న వారికి అక్కడే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తే వారు ఉపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. 'డబుల్'ఇళ్ల సముదాయంలో తాగునీటి వసతి, లైట్లు, డ్రైనేజీ సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా మీద.. మూసీ ప్రక్షాళన మీద తాను కొట్లాడానని అన్నారు. ఇళ్లు ఎలా కూలుస్తారంటూ గల్లపట్టి అడిగానని తెలిపారు. ఇచ్చిన హామీలు దేవుడెరుగు ఉన్న ఇల్లు కూలగొట్టి ఉపాధి పోయేలా చేస్తున్న ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, జిల్లా మాజీ అధ్యక్షులు శ్యాసుందర్‌గౌడ్, కంటోన్మెంట్ కన్వీనర్ విజాయానంద్, వార్డు అధ్యక్షుడు అరుణ్ పాల్గొన్నారు.



అన్నానగర్‌లో అభినందన సభలో మాట్లాతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

బన్సీలాల్‌పేట్ డివిజన్ సమస్యలను పరిష్కరించండి



జలమండలి జీఎం వినోద్‌కు వినతి పత్రం సమర్పించిన బీజేపీ నాయకులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు బుధవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షులు రామంచ మహేష్ అధ్వర్యంలో నాయకులు కేఎం కృష్ణ, అంగముత్తు శ్రీనివాస్, శివలింగం తదితరులు కలిసి జోనల్ కమిషనర్, జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతి పత్రాలను సమర్పించారు. గొల్ల కొమురయ్య కాలనీ మురుగునీటి సమస్యను పరిష్కరించాలని జీఎం వినోద్‌కుమార్‌ను కోరారు. అదే విధంగా గాంధీ ఆస్పత్రి వెనుక వైపు పద్మారావునగర్ రోడ్డులో చెత్తాచెదారం, వ్యర్థాల వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్కడి చెత్తాచెదారం తొలగించి దుర్వాసనను అరికట్టాలని జెడ్‌సీ రవికిరణ్‌కు కోరారు. సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే బీజేపీ తరఫున ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఐదోవార్డు పరిధిలోని జ్యోతి కాలనీలో రూ.50 లక్షల నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు ఎంపీ ఈటల రాజేందర్, బోర్డు సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులతో మాట్లాడి 5.9 ఎంజీడీ ఉన్న నీటి సరఫరాను 6.9 ఎంజీడీకి పెంచామన్నారు. అయితే ఆ నీటి నిల్వ చేసుకోవడానికి కంటోన్మెంట్ పరిధిలో రిజర్వాయర్ల సామర్థ్యం లేదన్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డిని స్వయంగా కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి ఆహ్వానించి బోర్డు సీఈఓ, ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించామన్నారు. కంటోన్మెంట్‌లో అదనపు రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి పూర్తి చేయించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మంచినీటి పైపులైను పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే శ్రీగణేశ్

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



ఇద్దరు డ్రైవర్ల దొంగతనాల తీరును వివరిస్తున్న జీఆర్పీ డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: దొంగతనాలు చేస్తూ తద్వారా వచ్చే డబ్బు ద్వారా విలాసాలు చేస్తున్న నేరగాళ్లయిన ఇద్దరు మిత్రులను రైల్వే పోలీసులు అదుపులోనికి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనిశెట్టిపల్లికి చెందిన తంబళ్ల నితిన్ (27), నిజామాబాద్‌కు చెందిన ఇందిరాల రాజేశ్ (35) అనే ఇరువురు మిత్రులు. వేర్వేరు కేసుల్లో పాత నేరస్తులు అయిన ఇరువురిలో ఒకరు ఆటో డ్రైవర్ కాగా మరొకరు ఆటోడ్రైవర్. ఇరువురికి జూదం, మద్యం, ఆన్‌లైన్‌గేమ్స్, బెట్టింగ్ తదితర వ్యసనాలు ఉన్నాయి. వ్యసనాలను తీర్చుకోవడంతో పాటు విలాసవంతమైన జీవితం గడపడం కోసం డ్రైవింగ్ వృత్తి ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం వృత్తిగా ఎంచుకున్నారు. ఈనెల 4 న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నితిన్, రాజేశ్‌లు 2వ నెంబర్ గేట్ వద్ద అనుమాస్పద పరిస్థితుల్లో పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో ఇరువురు నిందితులు తాము చేసిన నేరాలను అంగీకరించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇరువురు వేర్వేరుగా, కలిసి మొత్తంగా 39 నేరాలకు పాల్పడినట్టు అంగీకరించారు. లోగడ చేసిన నేరాల్లో పట్టుబడ్డ ఇరువురు నిందితులు పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఇరువురు నిందితుల నుంచి రూ. 11.46 లక్షల విలువ చేసే 114.6 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకుని చోరీ సొమ్ము రికవరీ చేయడంలో దర్యాప్తు చేసిన ఎస్ఐలు ఎంఏ మాజిద్, డి.రమేశ్‌లను డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.